# తనకు మాలిన ధర్మం

పొన్నాడ సత్యప్రకాశరావు

**"టిడిం..టిడిం.."కాలింగ్ బెల్ చప్పుడు విని తలుపు తీశాడు అభిరామ్.**

**ఎదురుగా సుబ్రహ్మణ్యం గారు.**

**"రండి! రండి!!" అయిష్టతని కనపడనివ్వకుండా ఆహ్వానించాడు అభిరామ్.**

**"చెప్పండి ఏమిటి విశేషాలు..అక్కయ్య గారు బాగున్నారా?" అడిగాడు సోఫాలో కూర్చుంటూ అభిరామ్ ఆయన్ని.**

"ఏం బాగోనయ్యా..ఒకటే బాగు..గానుగెద్దు జీవితాలు మావి. ఎదుగా బొదుగా!" నిట్టూర్చారు సుబ్రహ్మణ్యం గారు ఎప్పటిలానే.

"బాగున్నారా అన్నయ్య గారూ!" అంటూ కాఫీ తీసుకువచ్చింది అభిరామ్ భార్య వాణి.

"ఆ! మా పాపకి ఓ సంబంధం వచ్చిందమ్మా! అబ్బాయి వైజాగ్‌లో ఏదో ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. రేపే పెళ్ళి చూపులకు వస్తామన్నారు".

అలా చెప్పుకుపోతున్నారు సుబ్రహ్మణ్యంగారు వాణితో.

ఆలోచనల్లోకి జారుకున్నాడు అభిరామ్.

*** *** ***

పదిహేనేళ్ళ క్రితం తను కొత్తగా బ్యాంక్ ఉద్యోగంలో చేరి రూమ్ కోసం తిరుగుతున్నప్పుడు పరిచయమయ్యారు సుబ్రహ్మణ్యం గారు. ఆయనది లోయర్ మిడిల్ క్లాసనే చెప్పాలి. ఇద్దరమ్మాయిలూ..ఓ అబ్బాయీ..ఆయనకి స్థిరమైన ఉద్యోగం అంటూ ఎప్పుడూ లేదు. అప్పట్లో ఓ కంట్రాక్టర్ దగ్గరో పని చేస్తూ వుండేవారు. జీతం అయిదారు వందల కన్నా తక్కువే. ఓ నాలుగు వాటాల పోర్షన్లో వుండేవారు. చాలా కాలంగా వుండటం వల్ల, ఆయన పరిస్థితిని చూసి ఇంటావిడ అద్దె తక్కువ పుచ్చుకునేది. రెండు మూడు నెలలకోసారి ఇచ్చినా సణుక్కోవడం మినహా ఏమీ అనేది కాదు. రూమ్ కోసం ఆ పోర్షన్‌కి వెళ్ళినప్పుడు సుబ్రహ్మణ్యం గారు తమ ముందు వాటా గదిలో అభిరామ్‌ని దిగమని తాము మధ్యగదీ, వంటింట్లో సర్దుకుంటామని ప్రపోజ్ చేశారు. బ్రహ్మచారులకు అద్దెకు రూమ్‌లు దొరకడం చాలా కష్టం. అందువల్ల తన అవసరమూ తీరుతుంది. వారికి సహాయం చేసినట్టూ వుంటుంది అని మొత్తం అద్దెలో సగం ఇవ్వడానికి తను ఒప్పుకున్నాడు. ఒక మనిషి ఎక్కువైనా సుబ్రహ్మణ్యం గారు నెల నెలా అద్దె ఇవ్వొచ్చన్న ఆశతో ఇంటావిడా పెద్దగా అభ్యంతర పెట్టలేదు. అలా ముందు గదిలో చేరాడు అభిరామ్.

సుబ్రహ్మణ్యం గారు ఒక్కోసారి పనులేవీ లేవంటూ ఖాళీగా వుండేవారు. జీతం వుండేది కాదు. ఆయన భార్య శాంతమ్మ పేరుకు తగినట్టే వుంటూ గుట్టుగా సంసారాన్ని గడుపుకొస్తుంది. అందుకే ఆవిడంటే అందరికీ గౌరవం. ఆవిడ జాకెట్లు కుడుతూ, చిన్న చిన్న ఫంక్షన్స్‌కి వంట మనిషిగా పని చేస్తూ ఎంతో కొంత రెగ్యులర్‌గా సంపాదించేది.

సుబ్రహ్మణ్యం గారు మాత్రం ఎలాంటి పరిస్థితుల్లోనైనా తన సిగరెట్లూ, జర్దా కిళ్ళీలూ మానకుండా దొరికిన చోటల్లా అప్పులు చేస్తూ వుండేవారు. ఆయన కోసం కాకపోయినా శాంతమ్మనీ, సంసారాన్నీ చూసి అప్పులవాళ్ళు సర్దుకునేవాళ్ళు. అభిరామ్ కూడా వీలైనప్పుడల్లా సాయం చేసేవాడు. తరువాత సంవత్సరంలోనే అభిరాం పెళ్ళయినా ఆ ఏరియాలోనే ఇల్లు దొరకడంతో ఆ కుటుంబంతో పరిచయం తెగిపోలేదు. వాణికి కూడా శాంతమ్మ అంటే సానుభూతి..ఇష్టం.. అయితే రెండేళ్ళ క్రితం కొత్తగా కొనుక్కున్న అపార్ట్‌మెంట్‌లోకి మారేక రాకపోకలు తగ్గేయి.

*** *** ***

..అదమ్మా సంగతి! ఏవిటో బావగారు ఆలోచనల్లో మునిగిపోయారు" అన్న సుబ్రహ్మణ్యం గారి కుదుపుతో ఆలోచనల్లోంచి తేరుకున్నాడు అభిరామ్. తనకన్నా పదేళ్ళు చిన్నయినా 'బావ గారు' అని పిలుస్తారు అభిరామ్‌ని సుబ్రహ్మణ్యం గారు.

"ఆయనంతే లెండి!" నవ్వుకుంటూ లోపలికి వెళ్ళింది వాణి.

ఆమెకి తెలుసు భర్త ఏమి ఆలోచిస్తున్నాడో! ఎందుకంటే సుబ్రహ్మణ్యం గారు వచ్చినప్పుడల్లా ఏభయ్యో, వందో పట్టుకెళ్ళడం మామూలైపోయింది. అవి రాని బాకీలు. ఇప్పుడు పిల్లకి సంబంధం వచ్చిందంటున్నారు. ఎంతకి టెండర్ పడుతుందో నని అభిరామ్ ఆలోచిస్తున్నాడని వాణి వూహించింది. అది నిజం కూడా. ,

"ఇప్పుడు ఏం చేస్తున్నారండీ!" అభిరామ్ అడిగాడు కొంచెం వెటకారంగానే ఖాళీగా వున్నారా, లేక పనేమన్నా చేస్తున్నారా కనుక్కున్నట్టూ వుంటుందని.

"హోటల్ స్వాగత్‌లో చేస్తున్నానండి. పర్చేజెస్ అవీ నేనే చేస్తూ వుంటాను. రెండు పూటలా భోజనం, కాఫీ, టిఫిన్లు పెట్టి నెలకి రెండు వేలు ఇస్తారు. పర్చేజెస్‌లో కమిషన్ కొట్టనని ప్రొప్రయిటర్ గారికి నేనంటే అభిమానం. కమిషన్లు మొదలుపెడితే నా పరిస్థితి ఇలా వుండేది కాదు" అంటూ తన నిజాయితీ గురించి చెప్పడం మొదలు పెట్టారు.

కొంతమంది వాళ్ళ నిజాయితీని గురించి చెప్పుకోవటం అలవాటు. అంతవరకయితే మంచిదే. తమ కష్టాలకు, నష్టాలకు కారణం నిజాయితీయే అంటారు. నిజాయితీని తిట్టుకుంటూ నిజాయితీగా వుండటం ఎందుకూ? నిజాయితీపరులకు కష్టనష్టాలు తప్పవు. వాటిని భరించక తప్పదు. నిజాయితీ ముసుగులో అసమర్థతను కప్పిపుచ్చుకుని, ఇతరుల సానుభూతినీ, సహాయాన్నీ అర్థించడం ఎందుకు? నిజాయితీగా వుంటే బహుశః తక్కువ కాలంలో బిల్డింగ్‌లో, బ్యాంక్ బ్యాలెన్స్‌లో సమకూర్చుకోలేరేమో కాని మామూలుగా జీవించడం అసాధ్యమేమీ కాదు. పైగా గౌరవప్రదమైన, నిరాడంబరమైన జీవితం నిజాయితీగా వుంటూనే గడపొచ్చు. అయితే సుబ్రహ్మణ్యం లాంటి వాళ్ళు నిజాయితీపరులో కాదో తెలియదు. కానీ కచ్చితంగా

పని దొంగలు. నిజాయితీగా వుండటం వల్లలే కష్టాలొస్తున్నాయని అవసరాలకు అప్పులు చేస్తూ తీర్చకపోవటం నిజాయితీనా? విన్నెవరు నిజాయితీగా వుండమన్నారంటూరు అప్ప ఎగవేస్తే!.

"చాలా పేపయ్యింది వచ్చి..మీ టైమ్ .చాలా తినేశాను. రేపే పెళ్ళి చూపులకు వస్తామన్నారు. చేతిలో పైసా లేదు. అభిరామ్‌జీ! ఓ రెండు వందలుంటే సర్దుబాటు చేయి. పుణ్యముంటుంది. సమయానికి మా ప్రొప్రయిటర్ వూర్లో లేదు. అసలు విన్ననే మా హోటలుకి పదివేల రూపాయిల కొత్త ఫర్నిచర్ కొన్నాం. నేను తల్చుకుంటే కనీసం అయిదారు వందలైనా కమిషన్ దొరికేది. కాని నీకు తెలుసుగా! నేను నిజాయితీకి ప్రాణమిస్తాను! మా ప్రొప్రయిటర్ కూడా అందుకే తెగమెచ్చుకుంటాడు....." అంటూ చెప్పకుపోతునవాడు. ఆయనిక ఆపడని తెలిసి అభిరాం లోపలికెళ్ళొచ్చి–

"ఈ వంద రూపాయిలు వుంచండి. ఈనెల చాలా ఖర్చులో వున్నాను. పెళ్ళి చూపులంటున్నారని కదా అని ఈ వంద ఎలాగో సర్దుబాటు చేస్తున్నాను" అన్నాడు.

"అవునయ్యా! ఇద్దరు సంపాదిస్తున్నా ఏం సుఖం? ధరలు మండిపోతున్నాయి. సంబంధం సెటిలవ్వగానే ఆ శుభవార్త ముందుగా మీ చెవినే వేస్తాను" అంటూ వెళ్ళిపోయారు.

ఊపిరి పీల్చుకున్నాడు అభిరామ్.

"ఎంతిచ్చారండీ...వందా?" అడిగింది వాణి.

"ఊ! సుబ్రహ్మణ్యం గారిలో మార్పు చూశావా. మొదట్లో పది రూపాయిలు అడగడానికి కూడా ఎంత అభిమాన పడేవారో! ఇప్పడు ఎంత తేలిగ్గా అడగ్గలుగుతున్నారో! ఇంత వరకు మనం ఇచ్చింది తీర్చకపోవటం లేదు సరికదా! పైగా వారి నిజాయితీని మెచ్చుకుని, కష్టాలకు నొచ్చుకుని, మనంతట మనమే అదేదో మన డ్యూటీలా వారికి సాయం చేయాలి అన్నట్టుగా వుంది చూస్తుంటే".

"పోనీ లెండి! ఆయన మొహం చూసి కాదుగా ఎవరైనా సాయం చేసేది!"


"పిల్ల పెళ్ళి అంటున్నాడు. టెండర్ ఎంతకి వేస్తాడో? ఎంత అడిగినా వేయి రూపాయిల కన్నా ఇవ్వగలిగేది లేదు" అనేశాడు అభిరామ్.


"అలాగే. వీలయితేనే ఇద్దాం" అంది వాణి.

*** *** ***

రాత్రి భోజనాలయ్యాక బెడ్ మీద పడుకున్నాడే గానీ అభిరామ్ ఆలోచనలు ఓ కొలిక్కి రావడం లేదు.

'వీలయితేనే సాయం చేద్దాం' అని వాణి చెప్పింది. అసలు సహాయం ఎందుకు చేయాలి?






వాణి బి.ఎస్‌సి, బి.ఇడి.. పెళ్ళయిన కొత్తలో జాబ్ చేసేది. బాబు పుట్టినప్పుడు వాడిని చూసుకోవడానికి ఎవరూ లేకపోవడం తోనూ, క్రెష్‌లో జాయిన్ చేయడం ఇష్టం లేక జాబ్ మానేసింది. తన జీతంతో తన చిన్న ఫ్యామిలీ హాయిగా బ్రతకొచ్చు. అయితే ఈ మధ్యనే అపార్ట్‌మెంట్ తీసుకోవడం వల్ల కొంచెం ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాడు. పిల్లలు కూడా పెద్దవా ళ్ళవుతున్నారు. అందుకే మళ్ళీ వాణి ఉద్యోగం చేస్తానంటే సరే నన్నాడు. సిటీ లోని ఓ పెద్ద కాన్వెంట్‌లో టీచర్ పోస్ట్‌లు ఖాళీ అయితే అప్లై చేయించాడు. ఆ విషయం మాట వర సకి తన బ్యాంక్ మేనేజర్‌తో చెప్పాడు. ఆ కాన్వెంటు కమిటీ మెంబర్ తనకు తెలుసునని చెబితే తప్పక ఆ ఉద్యోగం వాణికి వస్తుందని మేనేజర్ అంటే తనకు ఇష్టం లేదని చెప్పేశాడు. ఇంటర్వ్యూకి వాణికి తోడుగా తనూ వెళ్ళాడు. ఒకటే పోస్టట. పది మంది దాకా ఇంటర్వ్యూకి వచ్చారు. అందులో తమ ప్రక్కనే కూర్చున్న అమ్మాయి అందరికన్నా క్వాలిఫైడ్. తండ్రి ఈ మధ్యనే పోయారుట. దాంతో కుటుంబ భారం ఆమెపై పడింది. అక్కడున్న మిగతా అందరి కంటే ఉద్యోగం ఆమెకే ప్రధానంగా అవసరం. పైగా క్వాలిఫైడ్, ఆ ఉద్యోగం ఆమెకొస్తేనే న్యాయం అనిపించింది. కాని ఆశ్చర్యంగా ఆమెకి రాలేదు. వాణి సెలెక్ట్ అయ్యింది.

థ్యాంక్స్ చెప్పడానికి కరస్పాండెంట్ రూమ్‌లోకి వెళ్ళినప్పుడు అక్కడ తమ బ్యాంక్ కస్టమర్, కమిటీ మెంబరూ అయిన చౌదరి గారు కనిపించి "భలేవాడివయ్యా రాంజీ! మరీ అంత మొహమాటం అయితే ఎలా బ్రతుకుతావయ్యా ఈ రోజుల్లో. మనం మనం సాయం చేసుకో కపోతే ఎలా! అమ్మాయి అప్లికేషన్‌లో నీ కేరాఫ్ అడ్రస్ చూసి మీ మేనేజర్‌ని నీకోసం అడిగాను. తప్పక సాయం చేయమని ఆయనే చెప్పారు. అమ్మాయిని సెలెక్ట్ చేశాం. రేపే జాయిన్ కావచ్చు" అంటూ అపాయింట్‌మెంట్ ఆర్డరు చేతిలో పెట్టారు.

ఎవర్నీ నోరు విడిచి అడుగకపోయినా ఆ ఉద్యోగం తమకే రావడం ఆనందం కలిగిం చింది.

"చూశారా! మనం ఎప్పుడూ వీలున్నంతలో ఒకరికి సాయం చేశామే కానీ ఎవరినీ బాధ పెట్ట లేదు. ఆ మంచితనమే మన అవసరంలో ఇలా ఆదుకుంది" అంది వాణి. 'కానీ ఆ ఆనందం కాస్తా తలవంచుకుని నిరాశతో వెళ్ళిపోతున్న ఆ హైలీ క్వాలిఫైడ్ అమ్మాయిని చూసేసరికి పటాపంచలైపోయింది. ఈ ఉద్యోగం తమకీ అవసరమే కాని ఆమెలా జీవన్మరణ సమస్య కాదు. లోనికి వెళ్ళి అపాయింట్‌మెంట్ ఆర్డ ర్‌ని రిటర్న్ చేద్దామా అనిపించింది. అలా చేస్తే ఆ మెంబర్ ఏమనుకుంటాడో ఏమో! పైగా ఆ అమ్మాయికే ఇస్తాడన్న గ్యారంటీ ఏముంది? తనకు 'పనులు' వున్న మరో వ్యక్తి తాలూకు వాళ్ళకి ఇస్తాడు. తనేం ఆ అమ్మాయిని మోసం చేయలేదే..ఆ అమ్మాయి ఎదురు పడింది కాబట్టే అలా అనిపించింది.




లోకంలో కష్టాలు ఎందరికి లేవు? సుబ్రహ్మణ్యం గారిలా నిజాయితీని తిట్టుకోకుండా నిజాయి తీగా బ్రతుకుతూ చేతనైనంతలో ఇతరులకి సహాయపడుతున్నాను కదా'.

ఇలా ఆలోచిస్తున్న అభిరామ్ ప్రక్కకు చేరు కుంది వాణి "ఇంకా పడుకోలేదా అభీ" అంటూ. తననెప్పుడూ అభీ అనే పిలవమం టాడామెను. "అన్ని చోట్లా బావుండదండీ!" అంటూ బెడ్ మీద మాత్రమే అలా పిలు స్తుంది.

"నువ్వు రాకుండా నిద్రెలా పడుతుంది? ఈ మెత్తని శిలలకేసి తల బద్దలు కొట్టుకుంటే గానీ మెదడు చల్లబడి నిద్ర రాదు". ఆ రోజుకి ఇంక ఇద్దరి మధ్యా మాటలు లేవు.

*** *** ***

ఓ పదిహేను రోజుల తర్వాత అభిరామ్‌ని కలిశారు సుబ్రహ్మణ్యం గారు. షరా మామూలే! అమ్మాయికి సంబంధం కుదిరిందనీ, తలో చెయ్యేసి ఆ శుభకార్యం కాస్తా జరిపించమని ప్రాధేయపడ్డారు. తన ఫేయికి 'ఐదు వేలు' కట్టినట్టుగా కనిపించింది. అభిరామ్ దగ్గర రెడీగా పదిహేను వేల రూపాయిలున్నాయి. ఇంటి మీద ఎంత పెట్టినా ఏదో పని చేయాల్సి వుంటోంది. ఇంటీరియర్ డెకరేషన్ కోసం, కొంచెం ఫర్నిచర్ కోసం ఆ డబ్బు వుంచాడు. సుబ్రహ్మణ్యం గారికి సాయం చేస్తే పుణ్యం వస్తుందో రాదో గానీ గోడకు కొట్టిన సున్నంలా డబ్బులు మాత్రం తిరిగి రావు. ఇప్పటికే చాలా ఇచ్చాడు. పరిస్థితులు బాగా లేనప్పుడు సిగరెట్లు, కిళ్ళీలూ మానేసి ఆ డబ్బుతో చిల్లర బాకీలైనా తీర్చొచ్చు. లేదంటే చిల్లర బాకీలు చేయ కుండా వుండొచ్చు. ఆ మాటే ఇన్‌డైరెక్ట్‌గా అంటే "తాను సిగరెట్లు చాలా తగ్గించేశాననీ, పూర్తిగా మానేస్తే మొదటికే మోసం వస్తుందనీ" అన్నారు ఏదో తమని ఉద్ధరించడానికి తాను బ్రతుకుతున్నట్టు. ఎలా తప్పించుకోవాలో అర్థం కాలేదు అభిరామ్‌కి.

అసలు సంబంధం వివరాలు కనుక్కుందా మని, పైగా శాంతమ్మ గారిని చూసి చాలా రోజులవ్వటంతో ఒకసారి చూసొద్దామని వారింటికి బయలుదేరాడు. దారిలో సిగరెట్ కాలుస్తూ సైకిల్ మీద వెడుతున్న పద్దెనిమిదేళ్ళ సుబ్రహ్మణ్యం గారి పుత్రరత్నం కనబడ్డాడు. 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా!' వాడు చదవకపోవటం వల్లా, ఆయన చదువు చెప్పించకపోవడం వల్లా వాడిని ఆటోనగర్‌లోని




ఏదో షాపులో చేర్పించారు. ఆ వచ్చేది వాడికే చాలదు. ఆడపిల్లలే సేల్స్‌గరల్స్‌గా తిరుగుతూ తల్లికి సాయపడుతున్నారు.

సుబ్రహ్మణ్యం గారి ఇంటి తలుపులు తీసే వున్నాయి. ఏవో మాటలు వినబడుతున్నాయి. తలుపు తడదామనుకుని తన పేరు వినబడటంతో మర్యాద కాకపోయినా గుమ్మం దగ్గరే ప్రక్కగా నిలబడ్డాడు అభిరామ్.

"ముహూర్తం కూడా పెట్టేసుకున్నాం. డబ్బు విషయం ఏం చేశారు?" అడుగుతున్నారు శాంతమ్మ గారు.

"తెలిసున్న వాళ్ళందర్నీ అడిగాను. ఎప్పుడూ ముందుగా అడిగిన వెంటనే ఇచ్చే అభిరామ్‌లో కూడా ఏదో మార్పు వచ్చింది. ఇద్దరూ బాగానే సంపాదిస్తున్నారు కదా! వాళ్ళు ఓ నాలుగు నెలలు సర్దుకుంటే మనకు ఓ ఐదు వేలు సాయం చేయగలరు. మనకి వున్నప్పుడు వడ్డీతో సహా మొహాన కొట్టొచ్చు" అంటున్నారు సుబ్రహ్మణ్యం గారు గుప్ప గుప్పున పొగ వదులుతూ. ఇంక అక్కడ వుండలేక వచ్చేశాడు అభిరామ్.

*** *** ***

పెళ్ళి పదిహేను రోజులుందనగా...

"ఏమండీ! సుబ్రహ్మణ్యం గారు వచ్చారండీ! మీరు లేరు. ఓ అయిదు వేలయినా సర్దమంటున్నారు" వాణి అడిగింది.

"మళ్ళీ వచ్చినప్పుడు ఈ పదిహేను వందలు ఇచ్చేసి ఇంతకన్నా కుదరటం లేదని చెప్పు".

"పాపం శాంతమ్మ గారు!"

"నిజమే. ఆవిడని చూసే ఇదైనా! అయినా నిన్ననే భాస్కర్ ఫోన్ చేశాడు. ఓ పదిహేను వేలు అవసరం అంటున్నాడు. నేను ప్రామిస్ చేశాను" అనేశాడు అభిరామ్.

*** *** ***

తన నిర్ణయం ఎంతవరకు సమంజసమో ఆలోచిస్తున్నాడు అభిరామ్.

సుబ్రహ్మణ్యం గారి ధోరణి అస్సలు బాగా లేదు. ఇద్దరూ సంపాదిస్తే అతనికి సహాయం చేయాలా? పైగా తీర్చే ప్రయత్నం చేయరు. ఇంతలో డబ్బు కావాలంటూ భాస్కర్ ఫోన్ చేశాడు. ఫస్ట్ ఫ్లోర్ శ్లాబ్ వేస్తున్నట్టు, రావాల్సిన డబ్బు సమయానికి అందకపోవడం వల్ల తనని సాయమడిగితే ఏలయితే సర్దమని, త్వరలోనే తీర్చేస్తానంటూ ఫోన్ చేశాడు. వెంటనే పదిహేను వేలు పంపించాడు. భాస్కర్ తనకన్నా మంచి స్థితిమంతుడే. ఏదో అవసరం వచ్చి వుంటుంది.

పిల్ల పెళ్ళికి సాయం చేయాలని అడిగితే తను డబ్బు ఇవ్వలేదు. తనకన్నా మంచి స్థితి మంతుడికి అడిగిన వెంటనే ఇచ్చాడు. తనది మంచితనమా? చిన్న వయసులో పెళ్ళి కావల్సిన వయసులో కుటుంబ భారం మోయవలసి వచ్చిన యువతికి రావలసిన ఉద్యోగం తన భార్యకి వచ్చినా వూరుకున్నాడు. అడిగిన వెంటనే భాస్కర్‌కి డబ్బు ఇవ్వడంలోని అంతర్యం... వెంటనే తీర్చేస్తాడన్న నమ్మకంతో బాటూ తన అవసరానికి పాతిక వేలయినా సర్దగల సమర్థత అతనికి వుండటమా? అసలు తను చేసింది ధర్మమేనా?

ఇలా ఆలోచించీ...ఆలోచించీ..తను మంచి వాడు కాకపోయినా చెడ్డవాడు మాత్రం కాదని, సుబ్రహ్మణ్యం వంటి వారికి అపాత్రదానం చేసి పరాన్న జీవులను ప్రోత్సహించడం మంచిది కాదని, తను చేయనిది తనకు మాలిన ధర్మమని నిర్ణయించుకుని తృప్తిపడ్డాడు ఆ మధ్యతరగతి మానవుడు.


# ఉత్తర భారత యాత్రలు

| | | Frequency | Fare Rs. |
|---|---|---|---|
| 1. | Delhi- Shimla- Kulu- Manali Chandigarh - Delhi | Every Friday | 2,200/- |
| 2. | Delhi-Agra - Jaipur - Delhi (Golden Triangle Tour) | Mon/Wed/Fri (Non-Ac) (AC) | 700/- 950/- |
| 3. | Delhi-Jaipur- Ajmer - Pushkar- Fatehpur Sikri-Agra- Mathura- Brindavan- Delhi | Every Monday | 1,000/- |
| 4. | Delhi - Mussorie - Haridwar - Rishikesh - Delhi | Tue/Fri | 600/- |

Fare includes Dormitory accommodation, transport and guide services. We are running approved LTC tours for Central Government employees. All tours are by Super Deluxe buses, starting from our New Delhi Office. Contact our offices at Bangalore Ph: 2262633, Madras Ph : 564864, Vijayawada Ph: 576624, Visakhapatnam Ph: 545565, Bombay Ph: 4326895 for advance reservations. మీరు ఢిల్లీ వచ్చినపుడు అధునాతన సౌకర్యములతో నిర్మింపబడిన 100 రూములు గల "హోటల్ సదరన్" లో బస చేయండి. ఢిల్లీలో రుచికరమైన గోంగూర, ఆవకాయ పచ్చళ్ళతో తెలుగు భోజనం మా హోటళ్ళలోని అమరావతి / సుప్రభాత్ రెస్టారెంట్లలో మాత్రమే లభించును.

HOTEL SOUTHERN/SOUTHERN TRAVELS (P) LTD.

( Recognised by Ministry of Tourism, Govt. of India)

ఢిల్లీలోని తెలుగువారి ప్రముఖ వాణిజ్య సంస్థ

| | |
|---|---|
| 18/2 Arya Samaj Road, Karol Bagh, New Delhi-5, Phones: 5722210, 5739508 Fax: 011-5751308 | Hotel Ayodhya Building, Lakdi-ka-pul, Hyderabad-500 004. Phones : 3307933, 3307658 |

SUVARNA